క్లుప్తంగా

సీఆర్‌ఎంటీ లక్ష్మీనారాయణకు సత్కారం



సీఆర్‌ఎంటీ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: తిమ్మరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్ సీఆర్‌ఎంటీ కర్రి లక్ష్మీనారాయణకు శనివారం ఘన సత్కారం జరిగింది. విద్యాభివృద్ధికి ఎంతగానో పాటుపడుతున్న ఆయనకు కాకినాడలోని చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఉత్తమ పురస్కారం ప్రదానం చేసింది. సంస్థ వార్షికోత్సవంలో భాగంగా విశిష్ట విద్యా సేవా పురస్కారం అందుకున్న లక్ష్మీనారాయణను స్థానిక ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడుతో పాటు ఎంఆర్‌సీ ఉద్యోగులు అభినందించారు.

33 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

పాయకరావుపేట: పట్టణంలోని వార్డు సచివాలయం – 4 పరిధిలో శనివారం అగనంపూడి హోమిబాబా క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార పరీక్షలు 33 మందికి చేసినట్లు వైద్యులు నమిత, సునీత తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, సీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సూపర్‌వైజర్ రమణ, నాగేశ్వరరావు, విజయకుమారి పాల్గొన్నారు.

సీతారామరాజునగర్‌లో అన్నసమారాధన



కోటవురట్ల: సీతారామరాజునగర్‌లో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

కోటవురట్ల: గణపతి నవరాత్రులు సందర్భంగా పలు వీధుల్లో గణనాథుల నిమజ్జనోత్సవాలతో సందడి నెలకొంది. స్థానిక సీతారామరాజునగర్‌లో బాల వినాయక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేడుకలలో భాగంగా శనివారం మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కైలాసపట్నం, రాజుపేట, లింగాపురం, తంగేడు, గవరపేట, జానకిరాంపురం ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు.

126 ఎకరాల్లో నీట మునిగిన వరి పంట



ఆవలో నీట మునిగిన గుంటపల్లి రైతుల వరి పొలాలు

పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో 126 ఎకరాల్లో వరి పంట వరద ముంపునకు గురైనట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ తెలిపారు. గుంటపల్లి, మంగవరం, నామవరం, గోపాలపట్నం, ఎస్.నర్సాపురం, పాల్తేరు గ్రామాలకు చెందిన 133 మంది రైతుల వరి పంట నీట మునిగినట్లు పేర్కొన్నారు. నీట మునిగిన వరి పంట వివరాలను ప్రభుత్వానికి నివేదించామన్నారు.

హిందీ ప్రావీణ్యంతో ఎన్నో ప్రయోజనాలు



ఆకట్టుకుంటున్న విద్యార్థుల వేషధారణ

ఎస్.రాయవరం: రాష్ట్ర భాషగా పిలవబడే హిందీ ప్రావీణ్యంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ప్రధానోపాధ్యాయుడు సంతోష్ తెలిపారు. శనివారం బంగారమ్మపాలెం పాఠశాలలో హిందీ దివస్ పురస్కరించుకుని విద్యార్థులతో పలు విన్యాసాలు చేయించారు. హిందీ పద్యాలు, పలు పాఠ్యాంశాల్లో సన్నివేశాలు ప్రదర్శన రూపంలో ఆకట్టుకున్నారు. ప్రభుత్వ పాఠశాల పిల్లలు హిందీలో అనర్గళంగా మాట్లాడటం, చదవడం చూసి గ్రామస్తులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్టూడెంట్ సపోర్ట్ టీమ్ సూరాడ నూకరాజు, జి.సోమేష్, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంకా ఇరుకు రోడ్డే..

- విస్తరణకు నోచుకోని ఆర్‌అండ్‌బీ రోడ్డు
- ఇరువైపులా పెరిగిన తుప్పలు
- ప్రమాదకరంగా ఆవపై బ్రిడ్జి
- వాహన చోదకులకు తీవ్ర ఇక్కట్లు



శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా గోపాలపట్నం ఆవపై బ్రిడ్జి



అరట్లకోట వద్ద విస్తరణకు నోచుకోని ఇరుకు మదుం



పాయకరావుపేట - అరట్లకోట మధ్యలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలు

పాయకరావుపేట: మండలంలో పాయకరావుపేట నుంచి పెంటకోట తీర ప్రాంతం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. 15 కిలోమీటర్ల మేర పొడవు గల రోడ్డు విస్తరణకు నోచుకోలేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాయకరావుపేట నుంచి అరట్లకోట, మంగవరం, గోపాలపట్నం, పెంటకోట, తీర ప్రాంతాలకు ఇదే ప్రధాన రహదారి. మంగవరం గ్రామం నుంచి సత్యవరం, మాసాహేబుపేట గ్రామస్తులు ఈ రోడ్డుపై ప్రయాణం సాగిస్తుంటారు. అభివృద్ధికి నోచుకోక రోడ్డు విస్తరణ జరగలేదు. పాయకరావుపేట నుంచి అరట్లకోట గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగాయి. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అరట్లకోట గ్రామం వద్ద సాగునీటి కాలువపై ఇరుకు మదుములను విస్తరించలేదు. అదేవిధంగా అరట్లకోట, మంగవరం గ్రామాల్లో రోడ్డు కుంచించుకుపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. గోపాలపట్నం ఆవపై నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. ఇరువైపులా రైలింగ్ శిథిలమైంది. రాత్రి సమయంలో వాహనదారుల ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అదే విధంగా గోపాలపట్నం గ్రామంలో రోడ్డు కుంచించుకుపోయింది. పెంటకోట గ్రామం ప్రారంభంలో సాగునీటి కాలువపై నిర్మించిన కల్వర్టు శిథిలమైంది. కల్వర్టు శిథిలమై ఎన్నో సంవత్సరాలు గడుస్తున్నా సరే నిర్మాణానికి నోచుకోలేదు. పెంటకోట గ్రామ సమీపాన రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలు పెరిగిపోవడంతో వాహన చోదకులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే రోడ్డుపై పెంటకోట మెరైన్ పోలీసు స్టేషన్‌కు, తీర ప్రాంతానికి ప్రయాణించాల్సి ఉంది. పాయకరావుపేట నుంచి పెంటకోట రోడ్డు ద్వారా నక్కపల్లి మండలంలోకి నిత్యం వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ రోడ్డుపై ఆరు గ్రామాల ప్రజలతో పాటు నక్కపల్లి మండల వాసులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు, స్కూల్ బస్సులు, కార్లు నిత్యం ప్రయాణిస్తుంటాయి. రోడ్డు విస్తరణ చేయకపోవడం వల్ల ఎదురెదురుగా వచ్చే వాహనాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహనాలు అతివేగంగా ప్రయాణించడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ, మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టాలి



పాయకరావుపేట, పెంటకోట రోడ్డు అభివృద్ధితో పాటు విస్తరణ చేపట్టాలి. తుప్పలు తొలగించాలి. కల్వర్టులు, వంతెనలు నిర్మించాలి. ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

– పెనుమత్స నాగేశ్వరరావు, మంగవరం

ప్రతిపాదనలు పంపించాం

పాయకరావుపేట, పెంటకోట రోడ్డుకు తుప్పలు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా తొలగిస్తాం. మరమ్మతులకు రూ.4.3 లక్షలు ఎస్టిమేషన్ వేసి ప్రతిపాదనలు పంపించాం. రోడ్డు విస్తరణకు, అభివృద్ధికి వికసిత్ భారత్ పథకంలో పెడుతున్నాం. గోపాలపట్నం వంతెన నిర్మాణానికి గతంలోనే ప్రతిపాదనలు పంపించాం.

– పి.జ్ఞానేశ్వరరావు, ఏఈ, ఆర్‌అండ్‌బీ, పాయకరావుపేట సెక్షన్

గణేష్ ఊరేగింపులపై నిఘా

- అశ్లీల ప్రదర్శనలుంటే కఠిన చర్యలు
- యలమంచిలి సీఐ ధనుంజయరావు



యలమంచిలి రూరల్: గణపతి విగ్రహాల ఊరేగింపు సందర్భంగా ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని, సర్కిల్ పరిధిలో అన్ని ప్రాంతాల్లోనూ నిఘా పెట్టామని యలమంచిలి సీఐ ఎస్.ధనుంజయరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్లో మాట్లాడారు. గణేష్ విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా జరగాలని, చెరువులు, సముద్రాల వద్దకు పిల్లలు వెళ్లకుండా చూడాలన్నారు. ఎక్కడ నిమజ్జనం చేస్తున్నారో ముందుగా ఉత్సవ కమిటీలు తెలియజేయాలని సూచించారు. ఉత్సవ నిర్వాహకులు సంప్రదాయబద్ధంగా విగ్రహాల నిమజ్జనం చేయాలన్నారు. అశ్లీల నృత్యాలు, అసభ్యకర ప్రదర్శనలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇందుకోసం ఆకస్మిక తనిఖీలు చేస్తామని స్పష్టం చేశారు. సర్కిల్ పరిధిలో 250కుపైగా వినాయక విగ్రహాలకు అనుమతులు ఇచ్చామన్నారు. వినాయక నిమజ్జనాలు సాఫీగా జరగడానికి పోలీసు బందోబస్తు ఇస్తామన్నారు. అన్ని గ్రామాల్లోనూ ఊరేగింపులపై నిఘా పెట్టామని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరూ పాల్పడకుండా పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. డీజే సౌండ్లతో ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని, ఇదే సమయంలో ట్రాఫిక్ సమస్యలు సృష్టించొద్దని హెచ్చరించారు. ఊరేగింపుల సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా నిమజ్జనాలన్నీ రాత్రి 10 గంటలలోపు పూర్తి చేయాలన్నారు.

లోక్ అదాలత్‌లో 356 కేసుల పరిష్కారం



లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

యలమంచిలి రూరల్: యలమంచిలి న్యాయస్థానాల పరిధిలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 356 కేసులు పరిష్కారమైనట్టు సీనియర్ సివిల్ జడ్జి పి. విజయ తెలిపారు. ఇందులో రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాదాలు, గృహహింస, చెక్‌బౌన్స్, ప్రి లిటిగేషన్ కేసులు ఉన్నాయి. పార్టీలు, న్యాయవాదులు కలిసి పెండింగ్ కేసులను లోక్ అదాలత్‌లో సామరస్యంగా పరిష్కరించుకున్నారు. పలువురు కక్షిదారులు, న్యాయవాదులు, వివిధ పోలీసు స్టేషన్ల సిబ్బంది న్యాయస్థానాల ప్రాంగణానికి చేరుకోవడంతో కోలాహల వాతావరణం కనిపించింది. ఈ సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ విజయ మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులను, పెండింగ్ కేసులను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ సరైన వేదిక అన్నారు. ఒకసారి అదాలత్‌లో రాజీ అయితే మళ్లీ కోర్టుకు వెళ్లే అవకాశం ఉండదన్నారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే బదులు ఒకేసారి లోక్ అదాలత్‌లో కేసును రాజీ చేసుకుంటే సమయం వృథా అవ్వకుండా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని న్యాయవాదులు, పోలీసులు పార్టీలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మొదటి అడిషినల్ సివిల్ జడ్జి ఏ రమేష్, లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: కొరుప్రోలు సెక్షన్ పరిధిలో ఆదివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. గుడివాడ, గుర్రాజుపేట, బంగారమ్మపాలెం పరిశ్రమలకు, చినఉప్పలం ఆక్వా చెరువులు, ధర్మవరం వ్యవసాయ బోర్లకు, ధర్మవరం ఆర్‌డబ్ల్యూఎస్ లైనుకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండబోదన్నారు.

ఏషియన్ పెయింట్స్ సహకారంతో రెగ్యులేటర్ల అభివృద్ధి



మునగపాకలో రెగ్యులేటర్లు పరిశీలిస్తున్న దృశ్యం

మునగపాక: సాగునీటి కాలువలపై రెగ్యులేటర్లను అభివృద్ధి చేస్తామని ఏషియన్ పెయింట్స్ హెచ్ఆర్ ఉదయకుమార్ తెలిపారు. మునగపాకలోని సాగునీటి కాలువలపై ఏర్పాటు చేసిన రెగ్యులేటర్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరమ్మతులకు గురైన రెగ్యులేటర్లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సాగునీటి ఇబ్బందులు తలెత్తవన్నారు. గేట్ల నిర్వహణలో రైతులు సహకరించాలన్నారు. ఏషియన్ పెయింట్స్ సహకారంతో తగు చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, రైతులు విల్లూరి నూకనరసింగరావు, దాడి శివ, ఆడారి లక్ష్మణరావు, అంబుజా సిమెంట్స్ ప్రతినిధులు వెంకట్ యాదవ్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పాములవాకలో పిచ్చిమొక్కల తొలగింపు



పాములవాకలో ట్రాక్టర్ ద్వారా తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

కోటవురట్ల: పాములవాకలో శనివారం పిచ్చిమొక్కల తొలగింపు చర్యలు చేపట్టారు. ఇక్కడ పలు ప్రాంతాలలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయి ప్రమాదకరంగా ఉండడంతో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తొలగించారు. హెల్త్ సెంటర్, రక్షిత నీటి పథకం ట్యాంకు, ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ హాల్, శ్మశాన వాటిక, ఎస్సీ కాలనీ నుంచి యరకన్నపాలెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో వర్షాలకు విపరీతంగా పిచ్చిమొక్కలు పెరిగిపోయి విషపురుగులు సంచరించే ప్రమాదం ఉండడంతో నాలుగు రోజులుగా క్లియరెన్సు చేయిస్తున్నట్టు ఆయన తెలిపారు.

యువజనోత్సవ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న విద్యా సంస్థల అధినేత నరసింహారావు

పాయకరావుపేట: ఏపీ ప్రభుత్వం యువజన సంక్షేమ శాఖ, సెట్రాజ్ ఆధ్వర్యంలో యువతలో దాగి వున్న ప్రతిభను గుర్తించి వారి నైపుణ్యాలను ప్రదర్శించుటకు ఈ నెల 13న కాకినాడ సత్కళావాహినిలో నిర్వహించిన యువజనోత్సవ పోటీల్లో శ్రీప్రకాష్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో ఆవిష్కరణ నేపథ్య పోటీల్లో ప్రదర్శించిన హెర్బల్ సోప్, లిక్విడ్ సోప్, ఫినాయిల్ ప్రాజెక్ట్‌లో పి.నందిని, ఎస్.కె మదీనా బీబీ, టి.శ్రీవల్లి, ఎం.ఉష, జి.లక్ష్మి జ్యోతి బృందం, జానపద గేయాలు సోలో పోటీలో జి.సాయిశ్రీ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జానపద గేయాలు (గ్రూప్)లో కె.సాత్విక, జి.సాయిశ్రీ, కె.సంధ్య, పి.అశ్రిత, కె.చంద్రిక, పి.లక్ష్మి అపర్ణ ద్వితీయ స్థానం, జానపద నృత్యం సోలోలో టి.చరణ్ జ్యోతి తృతీయ స్థానం సాధించారు. వీరిని విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

తోటాడలో బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేపడుతున్న బీజేపీ నాయకులు

మునగపాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పొలమరశెట్టి నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం రాత్రి తోటాడలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను పీఎం నరేంద్రమోదీ అమలు చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. సభ్యత్వ నమోదుపై దృష్టి సారిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు చదరం సూరప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వుడా రమేష్, కచెల్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా విజయ్‌కుమార్



ఇన్‌చార్జి కమిషనర్ విజయ్‌కుమార్

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా కస్తూరి విజయ్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. రామచంద్రపురం మున్సిపాలిటీలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న ఆయన్ను యలమంచిలి పురపాలక సంఘం మేనేజర్‌గా అధికారులు బదిలీ చేశారు. ఇక్కడ మేనేజర్ ప్రభాకరరావు ఇప్పటి వరకూ ఇన్‌చార్జి కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. ఆయనకు బదిలీ కావడంతో ప్రస్తుత మేనేజర్‌కు ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. కొద్ది రోజుల క్రితం యలమంచిలి పురపాలక సంఘానికి రెగ్యులర్ కమిషనర్‌గా ప్రసాదరాజును పురపాలక శాఖ ఉన్నతాధికారులు నియమించారు. విజయవాడలో వరదల కారణంగా ప్రభుత్వం అక్కడ ప్రత్యేక విధుల్లో ఆయనను నియమించింది. ఆయన ఇక్కడ విధుల్లో చేరేవరకు విజయ్ కుమార్ ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగనున్నారు.

యలమంచిలి రూరల్ ఎస్సై బాధ్యతల స్వీకరణ



విధుల్లో చేరిన ఎస్సై ఉపేంద్ర

యలమంచిలి రూరల్: స్థానిక పోలీసు స్టేషన్ ఎస్సైగా ఎం ఉపేంద్ర శనివారం విధుల్లో చేరారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన కేడీపేట పోలీస్ స్టేషన్ నుంచి ఇక్కడకు వచ్చి బాధ్యతలు తీసుకున్నారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలను నివారించడంతోపాటు తమ పీఎస్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూద క్రీడలు, గంజాయి అక్రమ రవాణా, వినియోగం, ఇతర నేరాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు తమకు సహకరించాలని కోరారు. ఎస్సై ఉపేంద్రకు రాజకీయ పార్టీల నాయకులు, పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వాడవాడలా అన్న సమారాధనలు

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు



చినరామభద్రపురంలో ఓంకారంలో దీపాలు



దేవవరంలో స్లో సైకిల్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం

నక్కపల్లి: గణపతి నవరాత్రులు సందర్భంగా శనివారం దేవవరం, వేంపాడు, నెల్లిపూడి గ్రామాల్లో అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. దేవవరంలో సీపీఎల్పీ యూత్ ఆధ్వర్యంలో చిన్నారులకు స్లో సైకిల్ రేస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చినరామభద్రపురం గణపతి ఆలయం వద్ద దీపారాధన జరిగింది. శివలింగం, ఓంకారం, స్వస్తిక్ ఆకారంలో మహిళలు వెలిగించిన దీపాలు ఆకట్టుకున్నాయి. గణపతి ప్రతిమలు ఏర్పాటు చేసిన మండపాల వద్ద కోలాటాలు, భజనలు, ఏకాహం వంటి సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ఆకారాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడ్ని భక్తులు దర్శించుకుని కానుకలు సమర్పించుకుంటున్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనాలు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వినాయక నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వినాయక వేడుకల్లో భాగంగా పలు గ్రామాల్లో విగ్రహాలను నెలకొల్పిన భక్తులు నిమజ్జనాలను చేపట్టారు. పలు చోట్ల అన్న సమారాధనలు నిర్వహించారు.

220 ఎకరాల్లో వరి పంటకు నష్టం



పంట నష్టాన్ని అంచనా వేస్తున్న అధికారులు

నక్కపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నక్కపల్లి మండలంలో 220 ఎకరాల్లో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని తహసీల్దార్ అంబేడ్కర్, వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో సాధారణ వరి సాగు 4400 ఎకరాలు కాగా, 4,480 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారన్నారు. ఈ నెల మొదటి వారంలో కురిసిన వర్షాలకు మండలంలో 220 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందన్నారు. వీటిని ప్రత్యేక బృందాలు పరిశీలన చేశాయన్నారు. 33 శాతంపైనే నష్టం వాటిల్లడంతో హెక్టారుకు రూ.17 వేల చొప్పున పరిహారం చెల్లించే అవకాశం ఉందన్నారు. పంట నష్టం జాబితాలో 230 మంది రైతులను నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపించామన్నారు.

ఉత్సవాలతో యువతలో ఐక్యత



మాట్లాడుతున్న గురునాథరావు

ఎస్.రాయవరం: గ్రామాల్లో గణపతి ఉత్సవాలతో యువతలో ఐక్యతా భావం పెరుగుతుందని జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు మాతా గురునాథరావు తెలిపారు. అడ్డురోడ్డులో గణపతి మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని యువతను అభినందించారు. స్థానిక నాయకులు బాబూరావు, సూరిబాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.